సాక్షి ఖమ్మం
గురువారం, 26, జనవరి, 2023



ఫైర్ సేఫ్టీ తప్పనిసరి
బహుళ అంతస్తుల భవనాల్లో అగ్నిమాపక శాఖ నిబంధనలు తప్పక పాటించాలని అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా సూచించారు. 8లో



ఎస్‌హెచ్‌జీ సభ్యులకు సోలార్
స్వయం సహాయక సంఘాల్లో ఎంపిక చేసిన సభ్యులకు సబ్సిడీ రుణాలపై సోలార్ యూనిట్లు ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 17°

వాతావరణం
గురువారం ఉదయం మంచు ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు. సాయంత్రం చలి తీవ్రత నమోదవుతాయి.

న్యూస్‌రీల్

మంత్రి కేటీఆర్‌ను కలిసిన పువ్వాడ



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర మంత్రి కల్వకుంట్ల తారకరామారావు దావోస్ పర్యటన ముగించుకుని వచ్చిన సందర్భంగా రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆయనను గురువారం హైదరాబాద్‌లో కలిశారు. దావోస్ పర్యటన సందర్భంగా రాష్ట్రానికి వేల కోట్ల పెట్టుబడులు సాధించడంపై శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ సభ విజయవంతం కావడంపై పువ్వాడను కేటీఆర్ అభినందించారు. అనంతరం వచ్చే నెల 10న ఖమ్మంలో జరగనున్న మంత్రి అజయ్ సోదరుడి కుమారుడు నరేన్ వివాహ రిసెప్షన్‌కు హాజరుకావాలని కేటీఆర్‌ను మంత్రి పువ్వాడ ఆహ్వానించారు.

అడిషినల్ డీసీపీ శబరీష్ బదిలీ

ఖమ్మం క్రైం: ఖమ్మం అడిషినల్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న శబరీష్ బదిలీ అయ్యారు. రాష్ట్రంలోని పలువురు ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా శబరీష్ హైదరాబాద్ సిటీ(క్రైం) డీసీపీగా బదిలీ అయ్యారు. అలాగే, భద్రాచలం ఏఎస్పీ రోహిత్‌రాజ్‌ను గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఐడీఓసీలోనే వేడుకలు



జెండా కర్రను సిద్ధం చేస్తున్న కలెక్టరేట్ సిబ్బంది



అతిథుల కోసం వేసిన కుర్చీలు

- జెండా వందనానికి కొత్త కలెక్టరేట్‌లో ఏర్పాట్లు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(నూతన కలెక్టరేట్ - ఐడీఓసీ)లోనే ఈసారి గణతంత్ర వేడుకలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అధికార యంత్రాంగం ఆధ్వర్యాన ఏర్పాట్లు పూర్తయ్యాయి. కలెక్టరేట్ ఆవరణలో జెండా ఆవిష్కరణ, ఇతర కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయగా, బుధవారం రాత్రి కలెక్టర్ వీ.పీ.గౌతమ్ పరిశీలించారు. గురువారం ఉదయం 9గంటలకు కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనుండగా, కొత్తగా జెండా గద్దె నిర్మించారు. అలాగే, ఆహుతుల కోసం కుర్చీలు, ఇతర ఏర్పాట్లు చేశారు. తొలుత పోలీసుల నుంచి కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించనున్నారు. ఈమేరకు ఏర్పాట్ల పరిశీలనలో అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్, రఘునాథపాలెం తహసీల్దార్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆనవాయితీకి భిన్నంగా...

ఇప్పటి వరకు గణతంత్రం, స్వాతంత్ర్య వేడుకలు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నారు. తాజాగా నూతన కలెక్టరేట్ ప్రారంభమైన నేపథ్యాన ఈసారి ఐడీఓసీలోనే గణతంత్ర వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా కేంద్రంలో అక్కడక్కడా ఉన్న 39శాఖల కార్యాలయాలన్నీ నూతన కలెక్టరేట్‌కు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో బుధవారం రాత్రి పొద్దుపోయే వరకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

రెండో రోజూ ప్రశాంతం

ఖమ్మం సహకారనగర్: జేఈఈ మెయిన్స్ బుధవారం రెండో రోజుకు చేరాయి. ఈ మేరకు జిల్లాలోని మూడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తుండగా, ఉదయం పరీక్షకు 452మందిలో 446మంది, మధ్యాహ్నం పరీక్షకు 452మందికి గాను 447మంది హాజరయ్యారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని సిటీ కోఆర్డినేటర్ పార్వతీరెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు.



దేశ భవిష్యత్ ఓటర్ల చేతిలోనే..

- జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ



ఓటర్‌కు గుర్తింపు కార్డు అందిస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: దేశ భవిష్యత్ ఓటర్ల చేతిలో ఉందన్న విషయాన్ని అందరూ గుర్తించి తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. నూతన కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటుచేసిన జాతీయ ఓటర్ల దినోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవడమే కాక, ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలన్నారు. జిల్లాలో ఇటీవల ఓటరు జాబితా సవరణ పూర్తి చేసి 18ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించామని తెలిపారు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు సమయానికి మరోసారి ఓటరు జాబితా సవరణ చేపట్టి అర్హులందరికీ ఓటు హక్కు వచ్చేలా చూస్తామని చెప్పారు. అనంతరం అధికారులతో ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా నూతన ఓటర్లకు కలెక్టర్ ఓటర్ గుర్తింపు కార్డులను అందించారు. అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్, డీఆర్వో శిరీష, జిల్లా నోడల్ అధికారి కె.శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు–మన బడి కార్యక్రమం క్రింద చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. ఐడీఓసీలో బుధవారం ఆయన అధికారులతో పనులపై సమీక్షించారు. జిల్లాలో 426 పాఠశాలల్లో మన ఊరు–మన బడి క్రింద పనులు చేపట్టగా, 49 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగతా చోట్ల కూడా పనుల్లో వేగం పెంచాలని, పనులు పూర్తయిన పాఠశాలలకు డ్యూయల్ డెస్క్ పంపిణీ చేస్తామని చెప్పారు. అదనపు కలెక్టర్ స్నేహలత, డీఈఓ సోమశేఖర శర్మ, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, ఈఈలు నాగేశు, శ్రీనివాసరావు, చంద్రమౌళి, కృష్ణాలాల్, ఎంఈఓలు, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అట్టహాసంగా ఉత్సవాలు

- ప్రారంభమైన రామదాసు జయంతోత్సవాలు
- హాజరైన కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి
- ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు



రామదాసు కాంస్య విగ్రహం వద్ద కళాకారులు, చిన్నారులు



మందిరంలో పూజలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే కందాళ తదితరులు

నేలకొండపల్లి: పరమ భక్తాగ్రేసరుడు, భద్రాద్రి ఆలయ నిర్మాత కంచర్ల గోపన్న(భక్తరామదాసు) జయంతోత్సవాలు ఆయన స్వస్థలమైన నేలకొండపల్లిలో బుధవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు సాగనున్న ఈ వేడుకలకు హాజరైన కలెక్టర్ వీ.పీ.గౌతమ్, పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పాల్గొని రామదాసు ధ్యాన మందిరంలో పూజలు చేశాక ఆయన కాంస్య విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ నేలకొండపల్లిలో జన్మించి ఈ ప్రాంత కీర్తి ప్రతిష్ఠలు పెంచిన రామదాసును ప్రతీ నిత్యం స్మరించుకోవాలని అన్నారు. రామదాసు ధ్యాన మందిరం అభివృద్ధికి కృషి చేస్తుండగా, వచ్చే ఏడాది జయంతోత్సవాలను ఆడిటోరియంలో జరుపుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీఎం కేసీఆర్ నేలకొండపల్లి పంచాయతీకి కేటాయించిన రూ.10 కోట్లలో రూ.కోటి నిధులను రామదాసు మందిరం అభివృద్ధికి వినియోగించనున్నట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఆడిటోరియం పనులను నెలలోగా పూర్తిచేసి అప్పగించాలని, మూడు రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

అలరించిన నగర సంకీర్తన

రామదాసు జయంతోత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల కళాకారులు ఇచ్చిన ప్రదర్శనలు అలరించాయి. విద్వత్ కళాపీఠం ఆధ్వర్యాన రామదాసు కీర్తనలు ఆలపిస్తూ నగర సంకీర్తన నిర్వహించగా, నేలకొండపల్లికి చెందిన పి.శ్రీనివాస్ రామదాసు వేషధారణలో, సరస్వతీ విద్యాలయం చిన్నారులు రాముడు, సీతాదేవి, ఆంజనేయస్వామి, లక్ష్మణుడు వేషధారణల్లో హాజరయ్యారు. అలాగే, వేదికపై కళాకారులు సంగీత ప్రదర్శన ఇచ్చారు. ఈకార్యక్రమాల్లో జిల్లా పర్యాటక శాఖాధికారి సుమన్‌చక్రవర్తి, జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, చెరకు అభివృద్ధి మండలి చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, సర్పంచ్‌లు రాయపూడి నవీన్, గండు సతీష్, ఎంపీటీసీలు బొడ్డు బొందయ్య, శీలం వెంకటలక్ష్మి, తహసీల్దార్ దారా ప్రసాద్, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఎంపీఓ శివ, విద్వత్ కళాపీఠం అధ్యక్షుడు సాధు రాధాకృష్ణమూర్తితో పాటు పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, కంచర్ల దేవీప్రసాద్, ఓరుగంటి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బాలలకు స్నేహపూర్వక న్యాయసేవలు



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు, పక్కన సీనియర్ సివిల్ జడ్జి జావేద్‌పాషా తదితరులు

ఖమ్మంలీగల్: బాలలకు స్నేహపూర్వకమైన న్యాయ సేవలను అందించడానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కట్టుబడి ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు తెలిపారు. కొణిజర్ల మండలం తనికెళ్లలోని గ్రేస్ పాఠశాలలో బుధవారం ఏర్పాటుచేసిన న్యాయ చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్యవివాహాలు, భ్రూణ హత్యలు, బాల కార్మిక వ్యవస్థ వంటి దురాచారాలు సమాజంలో బాలల అభ్యున్నతికి అడ్డుపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని నిర్మూలించడానికి ఎన్నో చట్టాలు ఉన్నా, ప్రజల్లో అవగాహన లేమి కారణంగా సమర్థవంతంగా అమలు కావడం లేదని తెలిపారు. దీనిని సరిదిద్దేందుకు న్యాయ సేవా సంస్థల ఆధ్వర్యాన అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా జడ్జి వెల్లడించారు. పాఠశాలలకు రోజు వచ్చే విద్యార్థుల్లో ఎవరైనా తరచుగా గైర్హాజరైతే సహచరులు న్యాయ సేవా సంస్థకు సమాచారం ఇవ్వాలని, తద్వారా న్యాయ సేవ అధికార సంస్థ పరిశీలించి ఆ విద్యార్థి బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలకు గురైతే రక్షించడం వీలవుతుందని చెప్పారు. ఈ సదస్సులో న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా, న్యాయవాదులు ఇమ్మడి లక్ష్మీనారాయణ, జనార్దన్, పాఠశాల ప్రిన్సిపాల్ జాకోబ్, చైల్డ్ లైన్ డైరెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

షాదీఖానాల నిర్మాణానికి రూ.3.50 కోట్లు

- ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: ముస్లింల విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్తుపల్లి, వేంసూరు, కల్లూరు మండల కేంద్రాల్లో షాదీఖానాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. మూడింటికి కలిపి రాష్ట్రప్రభుత్వం రూ.3.50 కోట్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఈమేరకు సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ధన్యవాదాలు తెలిపారు. మైనార్టీలు శుభకార్యాలు జరుపుకోవడానికి వీలుగా సత్తుపల్లిలో రూ.2 కోట్లు, వేంసూరు, కల్లూరులో రూ.75లక్షలతో షాదీఖానాలు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా వెల్లడించారు.



క్లుప్తంగా

నేడు జిల్లాలో మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండా, ఖమ్మం రాపర్తినగర్, బల్లెపల్లి, టేకులపల్లి, ఖానాపురం హవేలీతోపాటు వైరా, మధిర, పెనుబల్లిల్లో జరిగే పలు కార్యక్రమాలకు ఆయన హాజరవుతారని మాజీ ఎంపీ క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

ఉపాధిహామీ పనుల తనిఖీ


పని ప్రదేశంలో పరిశీలిస్తున్న కేంద్ర బృందం

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండలం జాస్తిపల్లి గ్రామపంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పనులను కేంద్ర బృందం అధికారులు బుధవారం తనిఖీ చేశారు. నర్సరీ, వైకుంఠ ధామం పనులతో పాటు రికార్డులు పరిశీలించారు. అలాగే, ఉపాధి కూలీలతో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. ఎంపీడీఓ గుప్తా, ఎంపీఓ జీవీఎస్.నారాయణ, ఏపీఓ శ్రీరాణి, పంచాయతీ కార్యదర్శి రమేష్‌తో పాటు బాప్‌సింగ్, సుప్రియ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణ పడిన అత్తాకోడళ్లపై కేసు

కారేపల్లి: ఒకరినొకరు దుర్భాషలాడుకుని, ఘర్షణ పడిన అత్తాకోడళ్లపై కారేపల్లి పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. కారేపల్లి అంబేడ్కర్ సెంటర్‌లో నివాసముంటున్న అన్నారపు నాగమణి కుమారుడు వేణు ఏడాది క్రితం సునీతను ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. కొంత కాలానికి వేణు సునీతను వదిలేసి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అదే ఇంట్లో ఉంటూ బేకరీలో పనిచేస్తోంది. ఈక్రమంలో ఆమెను అత్త అన్నారపు నాగమణి ఇంటి నుంచి వెళ్లిపోవాలని దూషించడంతో సునీత కూడా దుర్భాలాడగా ఇరువురి నడుమ ఘర్షణ జరిగింది. అనంతరం పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకోగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రాజకుమారి తెలిపారు.

ఫుడ్‌పార్కు ఎదుట గీత కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న గీత కార్మికులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని బుగ్గపాడులో ఫుడ్‌పార్కు సమీపాన రోడ్డు పనుల కోసం వందకు పైగా తాటిచెట్లను నరికివేశారంటూ గీత కార్మికులు బుధవారం ఆందోళనకు దిగారు. యాభై ఏళ్లుగా తాటిచెట్లపైనే ఆధారపడి జీవిస్తున్న తమ పొట్ట కొట్టారని ఆరోపించారు. ఫుడ్‌పార్క్ కాంట్రాక్టర్లు తాటి చెట్లను తొలగించడంతో తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ప్రభుత్వం ఈ విషయంపై స్పందించి తమను ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో గౌడసేన నాయకులు, గీతకార్మికులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు 'సోలార్'

- స్త్రీనిధి నుంచి బ్యాంక్ రుణంతో ఏర్పాటు
- జిల్లాలో ఆరు మండలాలు, మూడు మెప్మా గ్రూపులకు అవకాశం
- మండలానికి 35 మంది చొప్పున లబ్ధిదారుల ఎంపిక


టీఎస్ రెడ్‌కో, స్త్రీనిధి అధికారులతో చర్చిస్తున్న డీఆర్డీఓ విద్యాచందన

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి(టీఎస్ రెడ్‌కో) ఆధ్వర్యాన మహిళా సంఘాల సభ్యులకు సోలార్ యూనిట్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇంధన పొదుపులో భాగంగా మహిళా సంఘాలను భాగస్వాములను చేసేందుకు సబ్సిడీపై స్త్రీనిధి రుణంతో యూనిట్లు అందించనున్నారు. ఈ యూనిట్ల ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్ గృహావసరాలకు పోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్లకు విక్రయించుకునే వెసులుబాటు కల్పిస్తారు. బ్యాంకు రుణాలు తీసుకుని సకాలంలో చెల్లిస్తున్న ఎస్‌హెచ్‌జీలను ఈ యూనిట్లకు అర్హులుగా ఎంపిక చేయనున్నారు. ఇలా జిల్లాలో ఆరు మండలాలు, మూడు మెప్మా గ్రూపులను సోలార్ యూనిట్ల మంజూరుకు ప్రభుత్వం ఎంపిక చేసి ఉత్తర్వులు జారీ చేసింది.

అనుకొల్లును ఆదర్శంగా తీసుకుని..


సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. నిజామాబాద్ జిల్లాలోని అనుకొల్లులో వంద శాతం మహిళా సంఘాల సభ్యులు టీఎస్ రెడ్‌కో ద్వారా సౌర విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేసుకున్నారు. ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వం అన్ని జిల్లాల్లో కొన్నేసి మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈమేరకు ఖమ్మం జిల్లాలో చింతకాని, ఎర్రుపాలెం, ముదిగొండ, సత్తుపల్లి రూరల్, ఖమ్మం రూరల్, కొణిజర్ల మండలాలతో పాటు మెప్మా ఆధ్వర్యంలోని సత్తుపల్లి ప్రియదర్శిని సంఘం, మధిర సరస్వతి సంఘం, ఖమ్మం కస్తూరి సంఘాలను ఎంపిక చేసింది. ఒక్కో మండలంలో 35 మహిళా సంఘాలకు, మెప్మాలోని సంఘాలకు 35 చొప్పున యూనిట్లు మంజూరు చేస్తారు.

వీరికే అవకాశం..

స్వయం సహాయక సంఘాల్లో సభ్యులు బ్యాంక్ లింకేజీ ద్వారా తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించడంతో పాటు విద్యుత్ వినియోగం 200 యూనిట్ల నుంచి 300 యూనిట్లకు పైగా ఉంటే సోలార్ యూనిట్లు మంజూరు చేస్తారు. ప్రభుత్వం ఎంపిక చేసిన మండలాల్లో ఉత్తమ స్వయం సహాయక సంఘాలను గుర్తించి వారిలో అర్హులైన సభ్యుల వివరాలు సేకరిస్తున్నారు. స్త్రీనిధి సిబ్బంది, టీఎస్ రెడ్‌కో అధికారులు ఈ యూనిట్ల ఏర్పాటును సమన్వయం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. కాగా, సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకున్న సభ్యులు తమ కుటుంబ అవసరాలు పోగా మిగులు విద్యుత్‌ను నెట్ మీటర్ ద్వారా గ్రిడ్లకు విక్రయించే అవకాశం కల్పిస్తారు. ఈమేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి విద్యాచందన ఆధ్వర్యాన టీఎస్ రెడ్‌కో డీఎం ఉమాకాంత్, స్త్రీనిధి ఆర్ఎం రవీంద్రనాయక్ బుధవారం ఖమ్మంలో సమావేశమయ్యారు. యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక, రుణాల గ్రౌండింగ్, సబ్సిడీ, దరఖాస్తులపై చర్చించారు. ఇప్పటికే ఏయే మండలాల్లో యూనిట్లు మంజూరు చేయాలో నిర్ణయించిన నేపథ్యాన ఆసక్తి, అర్హత కలిగిన సభ్యులను గుర్తించే ప్రక్రియ ప్రారంభించారు.

సోలార్ విద్యుత్ యూనిట్ల కెపాసిటీ, పథకం వివరాలు ఇలా..

యూనిట్ కెపాసిటీ	2 కిలోవాట్స్	3 కిలోవాట్స్
ప్రాజెక్టు విలువ	రూ.1,42,200	రూ.1,92,360
సబ్సిడీ	రూ.39,200	రూ.57,360
దరఖాస్తు రుసుము	రూ.2,360	రూ.3,450
నెట్ మీటర్ చార్జీలు	రూ.2,950	రూ.2,950
స్త్రీనిధి రుణం	రూ.1,00,000	రూ.1,25,000
సభ్యురాలి వాటా	రూ.3,000	రూ.10,000
నెలవారీ వాయిదా	రూ.2,243	రూ.2,803



ముందస్తు వేడుకలు !


ర్యాలీలో విద్యార్థులు, మున్సిపల్ చైర్మన్ జైపాల్

వైరా: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వైరాలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కేజీ సిరిపురం విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు జాతీయ నాయకుల వివిధ వేషధారణలో ప్రధాన రహదారిపై జాతీయ పతకాలు చేబూని ర్యాలీలో పాల్గొన్నారు. జై జవాన్ - జై జవాన్ నినాదాలతో హోరెత్తించగా, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, విజ్ఞాన్ కరస్పాండెంట్ జయప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

2.64 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం

మహారాష్ట్రకు చెందిన ఇద్దరు అరెస్ట్


గంజాయి, నిందితులను చూపుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు

బూర్గంపాడు: చింతూరు నుంచి ఉస్మాన్‌బాద్‌కు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు మహారాష్ట్రవాసులను బూర్గంపాడు పోలీసులు పట్టుకున్నారు. బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం పాల్వంచ డీఎస్పీ సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. బూర్గంపాడు ఎస్‌ఐ సంతోష్ సిబ్బందితో కలిసి బుధవారం ఉదయం మోరంపల్లిబంజర వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో ఐషర్ మినీ వ్యాన్‌ను ఆపిన ఆగకుండా వేగంగా వెళ్లిపోయింది. దీంతో పోలీసులు వెంబడించి అంజనాపురం సమీపంలోని సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ వద్ద పట్టుకున్నారు. వాహనాన్ని బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించి తనిఖీ చేయగా అందులో 125 ప్యాకెట్లలో 2.64 క్వింటాళ్ల గంజాయి దొరికింది. దీని విలువ సుమారు రూ.53 లక్షలు ఉంటుంది. వ్యాన్ డ్రైవర్ మహదేవ్ మోహన్ గోడ్కే, క్లీనర్ కిషన్ కాళిదాస్ పవార్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. మంగళవారం వీరితోపాటు సూత్రధారులు పప్పు మామా, సత్యజిత్ కూడా కారు, మినీ వ్యాన్‌లో చింతూరు వెళ్లారు. అక్కడ మినీ వ్యాన్‌లో గంజాయి ప్యాకెట్లు పెట్టుకుని మహారాష్ట్రకు బయలుదేరారు. పప్పు మామా, సత్యజిత్ కారులో వెళ్లిపోగా, లారీ డ్రైవర్, క్లీనర్‌లు మినీ వ్యాన్‌లో వస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వ్యాన్ యజమాని అభిరాం పవార్‌పై కూడా కేసు నమోదు చేశామని, కారులో పరారైన పప్పు మామా, సత్యజిత్‌ల కోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. డ్రైవర్, క్లీనర్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాల్వంచ సీఐ నాగరాజు, ఎస్‌ఐలు సంతోష్, రమణారెడ్డి, ఏసుబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బాలిక అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: బాలిక అదృశ్యంపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఈ నెల 23న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లేదు. దీంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫైర్ సేఫ్టీ తప్పనిసరి


కంటి పరీక్ష చేయించుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా

సత్తుపల్లిటౌన్: భారీ భవనాలు, మాల్స్‌లో అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా తగిన ఏర్పాట్లు తప్పనిసరని అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా సూచించారు. సత్తుపల్లిలోని పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, సినిమా థియేటర్లు, మాల్స్‌ను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బహుళ అంతస్తుల భవనాల్లో ప్రతీ ఫ్లోర్‌లో ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ఇక సెల్లార్లను పార్కింగ్ కోసమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. కాగా, సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధి ద్వారకాపురి కాలనీలో కంటి వెలుగు శిబిరాన్ని అసిస్టెంట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు చేయించుకున్న ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, ఫైర్ ఆఫీసర్ ఐ.చంద్రశేఖర్‌రెడ్డి, టీపీఓ శ్రీనివాస్, డాక్టర్ రవితేజ, సిబ్బంది ప్రమీలారాణి, నర్సింహారావు, కామేశ్వరి, కృష్ణవేణి పాల్గొన్నారు.

అందరినీ అలరించేలా 'తుపాకుల గూడెం'


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

ఖమ్మంగాంధీచౌక్: వారధి క్రియేషన్స్ బ్యానర్‌పై జయదీప్ విష్ణును దర్శకుడిగా పరిచయం చేస్తూ నిర్మించిన 'రెబల్స్ ఆఫ్ తుపాకుల గూడెం' చిత్రం అన్నివర్గాల ప్రజలు ఆదరించేలా ఉంటుందని హీరో శ్రీకాంత్ రాథోడ్ తెలిపారు. ఖమ్మంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తర భారతదేశానికి చెందిన ఓ ఉద్యోగి కథను ఇతివృత్తంగా తీసుకుని నిర్మించిన ఈ సినిమా షూటింగ్ ఏటూరునాగారం, తాడ్వాయి, మేడారం అడవులతో పాటు గోదావరి తీరంలో జరిగిందని తెలిపారు. సంతోష్ మురారికర్ కథ అందించిన ఈ చిత్రంలో ప్రవీణ్ ఖండెలా మరో హీరోగా, హీరోయిన్‌గా హైదరాబాద్‌కు చెందిన జయిత్రీ మఖానా నటించారని, మణిశర్మ సంగీత దర్శకత్వం వహించారని పేర్కొన్నారు. ఈనెల 3వ తేదీన విడుదల కానున్న సినిమాను జిల్లా వాసులు ఆదరించాలని శ్రీకాంత్ కోరారు. ఈ సమావేశంలో అనూప్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హ్యుందాయ్ నూతన మోడళ్లు విడుదల


కార్లను ఆవిష్కరిస్తున్న ఆర్టీఓ, తదితరులు

ఖమ్మంఅర్బన్: మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా హ్యుందాయ్ సంస్థ రూపొందించిన రెండు మోడల్ కార్లను ఖమ్మం మార్కెట్‌లోకి విడుదల చేసింది.ది గ్రాండ్ ఐ 10 నియాస్, కాంపా సెడాన్ న్యూ ఆరా మోడళ్లను బుధవారం ఆవిష్కరించారు. ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్‌లోని భారత్ హ్యుందాయ్ షోరూంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా రవాణాశాఖ అధికారి తోట కిషన్‌రావు ఈ కార్లను విడుదల చేసి మాట్లాడారు. ఒకేసారి రెండు నూతన మోడళ్లను ఖమ్మం ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. భారత్ హ్యుందాయ్ గ్రూప్ చైర్మన్ కేసా సుభాష్‌చంద్రబోస్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ లక్ష్మీశారద, షోరూం జీఎం శయనకృష్ణ, యూబీఐ ఏజీఎం రాజశేఖర్, చీఫ్ మేనేజర్ రామలింగేశ్వరరావు, హెచ్‌డీఎఫ్ మేనేజర్ పాపరాజ్ తదితరులు పాల్గొన్నారు..

అనాసాగారంలో పట్టపగలు చోరీ

రూ.50 వేల నగదు, బంగారం మాయం

నేలకొండపల్లి: ఇటీవల నేలకొండపల్లిలోని పలు దుకాణాలు, ఇళ్లలో చోరీ జరుగుతుండగా.. తాజా గా మరో ఘటన చోటు చేసుకుంది. ఓ రైతు కుటుంబం పొలం వద్దకు వెళ్లొచ్చే సరికి నగదు, బంగారం సొత్తు దొంగలు కాజేశారు. మండలంలోని అనాసాగారానికి చెందిన రైతు మోర సత్యనారాయణ కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం పొలం వద్దకు మధ్యాహ్నం తిరిగి వచ్చారు. అయితే, తాళం ఇంటి సూరులో తాళపు చెవి పెట్టి వెళ్లగా, పసిగట్టిన దుండుగులు లోనకు ప్రవేశించి బీరువా తాళం దొరకబట్టుకుని రూ.50 వేల నగదు, మూడు తులాల బంగారు చంద్రహారం కలిపి రూ.2.50లక్షల విలువైన సొత్తు ఎత్తుకెళ్లారు. ఈమేరకు బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వగా సిబ్బంది చేరుకుని వివరాలు సేకరించారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

మధిర: పట్టణ సమీపంలోని వైరా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవె న్యూ సిబ్బంది మంగళవారం రాత్రి గుర్తించారు. ఈమేరకు ట్రాక్టర్లను తహసీల్‌కు తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాంబాబు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని, మరోసారి పట్టుబడితే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

అప్రకటిత విద్యుత్ కోతలు ఎత్తివేయాలి

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

చింతకాని: వ్యవసాయానికి అప్రకటిత విద్యుత్ కోతలు ఎత్తివేయాలనే డిమాండ్‌తో రైతులు రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. మండలంలోని నాగులవంచ, పందిళ్లపల్లి, కొదుమూరు గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట బుధవారం ఆందోళనకు దిగారు. ఈ క్రమంలోఖమ్మం-బోనకల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టగా, పలువురు రైతులు మాట్లాడారు. పగటి వేళ వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా చేయకపోవడంతో మొక్కజొన్న, మిర్చి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇకనైనా నిరంతరంగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో గంట పాటు కొనసాగడంతో పందిళ్లపల్లి, నాగులవంచ ప్రధాన రహదారికి ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ఏడీఈ తిలక్ పందిళ్లపల్లి సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి నిరంతరంగా విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, రైతు సంఘాల నాయకులు బందెల నాగార్జున్, కొప్పుల గోవిందరావు, కన్నెబోయిన గోపీ, పెంట్యాల అప్పారావు, ఓర్సు వీరభద్రం, అబ్బూరి మహేష్, తోటకూరి వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు


సదస్సులో మాట్లాడుతున్న జేడీ వేణుమాధవ్

ఖమ్మంఅర్బన్: ఇళ్లలో పెంచుకునే జంతువులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలని జిల్లా పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ వేణుమాధవ్ సూచించారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా బుధవారం టేకులపల్లి గురుకులంలో ప్రిన్సిపాల్ రమేష్ అధ్యక్షతన అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా జేడీ మాట్లాడుతూ జంతువులకు కూడా మనుషుల్లాగే జీవించే హక్కు ఉందని తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించి జంతువులతో ప్రేమగా మెదలాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ భాను, పశువైద్యాధికారి క్రాంతికుమార్, భువనేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం..

గుండెపోటుతో వరుడి నానమ్మ మృతి

కూసుమంచి: మనువడికి వివాహానికి ఏర్పాట్లు జరుగుతుండగా.. సంతోషంగా పాలుపంచుకుంటున్న నాయనమ్మ గుండెపోటు మృతి చెందింది. దీంతో పెళ్లి జరగాల్సిన ఇంట విషాదం అలుముకుంది. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని గట్టుసింగారానికి చెందిన నెల్లూరి వీరభద్రం కుమారుడు సాయిచరణ్ వివాహం గురువారం ఉదయం 9.45కు కోదాడలో జరగాల్సి ఉంది. ఈమేరకు బుధవారం బంధువులంతా చేరుకోగా, పెళ్లికుమారుడిని చేసే వేడుక నిర్వహించారు. ఈ ఆనందం కొనసాగుతుండగానే సాయిచరణ్ నాయనమ్మ సీతారావమ్మ(65) రాత్రి ఛాతినొప్పి రావడంతో హుటాహుటిన ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో అందరూ సంతోషంగా ఉన్న ఆ ఇంట ఒక్కసారిగా విషాదం నెలకొంది.

వన్ బై టూ !



ఒకే గదికి రెండు శాఖల బోర్డులు

ఖమ్మం మయూరిసెంటర్: ఇటీవల ప్రారంభమైన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(నూతన కలెక్టరేట్)లోకి జిల్లా కేంద్రంలో ఉన్న 39శాఖలను తరలించారు. అయితే, సరిపడా గదులు లేకపోవడంతో ఒకే గదిని రెండు శాఖలకు కేటాయించగా, ఇరుగ్గా విధులు నిర్వర్తించాల్సి వస్తోందని వాపోతున్నారు. భవనంలోని మొదటి అంతస్తు ఎఫ్-8 గదిని గెజిటెడ్ ఆహార తనిఖీ అధికారితో పాటు ఔషధ నియంత్రణ సహాయ సంచాలకులకు కేటాయించారు. చిన్న హాల్‌లా ఉన్న ఈ గదిలో నాలుగు క్యాబిన్లు ఏర్పాటు చేసుకుని రెండు శాఖల ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆహార తనిఖీ అధికారి కార్యాలయంలో శాంపిళ్లు నిల్వ చేసే ఫ్రిడ్జ్, ఇతర సామాగ్రి పెట్టుకునే చోటు లేకపోవడంతో పాత కార్యాలయ భవనంలోనే ఉంచినట్లు సమాచారం.

భార్యను వేధించిన భర్తపై కేసు

ఏన్కూరు: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మండలంలోని కోదండపురానికి చెందిన ఝాన్సీకి అదే గ్రామ వాసి సైదులుతో ఇరవై ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత ఆరేళ్లుగా మద్యానికి బానిసైన సైదులు అదనపు కట్నం కావాలని భార్యను వేధిస్తున్నాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో భార్యను తలపై కొట్టి హత్యాయత్నం చేశాడు. దీంతో ఝాన్సీ కేకలు వేయగా స్థానికులు ఆమెను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఝాన్సీ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.